క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ గెలుపొందాలని..!

సదుం: పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులతోపాటు రాష్ట్రంలోని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఎన్నికల్లో విజయం సాధించాలనే మొక్కుబడితో తాటిగుంటపాలెం గ్రామస్తులు శబరిమలై యాత్రకు వెళ్లారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ద్వారకనాథ్‌రెడ్డి విజయం సాధించాలని శబరిమలై అయ్యప్పస్వామిని గురువారం రాత్రి దర్శించుకుని పూజలు చేశారు. యాత్ర చేసిన వారిలో ప్రభాకర్, మనోజ్‌కుమార్‌రెడ్డి, సుధాకర్ ఉన్నారు.

లెక్కల పరీక్షకు 21మంది గైర్హాజరు

పలమనేరు: మండలంలో జరుగుతున్న టెన్త్ పరీక్షల్లో శుక్రవారం నిర్వహించిన గణితం పరీక్షకు 21మంది గైర్హాజరైనట్టు ఎంఈఓలు లీలా రాణి, బాలసుందరం తెలిపారు. మొత్తం ఆరు సెంటర్లలో 1338మందిగాను 1317మంది విద్యార్థులు పరీక్ష రాశారని చెప్పారు.

250 మంది వైద్య పరీక్షలు



కొత్తయిండ్లులో నిర్వహిస్తున్న వైద్యశిబిరం

కుప్పం రూరల్: కుప్పం ఇంజినీరింగ్ కళాశాల కొత్తయిండ్లులో నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం వైద్యశిబిరం ఏర్పాటు చేసింది. పీఈఎస్ మెడికల్ కళాశాల వైద్య బృందం 250 మంది రోగులను పరీక్షించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసింది. మెరుగైన వైద్యసేవలు అవసరమైన వారిని పీఈఎస్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్‌బాబు, అధ్యాపకులు శరవణ, సత్యమూర్తి, మాధవన్, వైద్య బృందం శేఖర్‌రెడ్డి, కుమార్‌తేజ, కృష్ణ, సుభాష్ తదితరులు ఉన్నారు.

జల సంరక్షణ మనందరి బాధ్యత



టేకుమంద జెడ్పీ హైస్కూల్లో జల ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

బంగారుపాళెం: జల సంరక్షణ మనందరి బాధ్యత అని టేకుమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు వేణురెడ్డి అన్నారు. మండలంలోని టేకుమంద జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం అంతర్జాతీయ జల దినోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, సకల జీవకోటికి ప్రాణాధారం నీరే అని అన్నారు. మానవుల నిర్లక్ష్యం కారణంగా భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలను పెంపొందించుకునే అవకాశాలను మెరుగు పరచుకుని నీటిని కాపాడుకోవాల్సిన కర్తవ్యం అందరిపై ఉందన్నారు. అందుబాటులో ఉన్న జలవనరులను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సైన్స్ ఉపాధ్యాయులు విజయకుమారి షంషీర్‌ఖాన్ మాట్లాడుతూ, నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. దీనికి అందరూ కట్టుబడి ఉండాలని సూచించారు. వర్షపు నీటిని సద్వినియోగం చేసుకుని భూగర్భజలాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం రామన్ సైన్స్ క్లబ్ సభ్యులు నీటి బిందువు ఆకారాన్ని ఏర్పాటు చేసి నీటివనరులను సంరక్షిస్తామని జల ప్రతిజ్ఞ చేశారు. ఉపాధ్యాయులు దేవకి, కేశవులు, వెంకటస్వామి, జయప్రకాష్, వెంకటరమణ, సుభలక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

గుడిపాల: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్రగాయాలైనట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వేలూరు నుంచి తిరుపతికి వెళ్తున్న బస్సు పల్లూరు గ్రామానికి చెందిన శ్వేత(29) రోడ్డు దాటుతుండగా ఢీ కొట్టింది. దీంతో ఆమె తీవ్రగాయాలపాలైంది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అవకాశం ఇవ్వండి..

అభివృద్ధి కొనసాగిస్తాం

- హామీలన్నీ నెరవేర్చిన ఘనత వైఎస్సార్‌సీపీదే
- బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ



ఎమ్మెల్యేతో కలసి మేము సిద్ధం..మా బూత్ సిద్ధం అని నినదిస్తున్న పార్టీ నాయకులు

పెద్దపంజాణి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందజలో ఉంచామని, మళ్లీ అవకాశం ఇస్తే అభివృద్ధి కొనసాగిస్తామని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు పంచాయతీలలో ఆయన బూత్ కమిటీ సభ్యులకు సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు కావాలన్నా, పేదల జీవితాల్లో వెలుగులు నిండాలన్నా తిరిగి ముఖ్యమంత్రిగా జగన్నను తీసుకురావడం అందరి సమష్టి బాధ్యత అన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి ఊసే లేదని, కేవలం వారి స్వలాభం కోసమే రాజకీయాలు చేశారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వం తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులను ప్రతిఒక్కరూ ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు చెప్పాలన్నారు. బూత్ కన్వీనర్లు మరింత క్రియాశీలకంగా పనిచేయాలని కోరారు. వచ్చే రోజులు చాలా కీలకమైనవని, 'మేము సిద్ధం..మా బూత్ సిద్ధం' అనే నినాదంతో ముందుకు వెళ్లాలన్నారు. ఎంపీపీ రెడ్డెప్ప, పార్టీ మండల కన్వీనర్ బాగారెడ్డి, వైస్ ఎంపీపీ జీడీబాబు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు హరినాథ్, సింగల్‌విండో మాజీ చైర్మన్ శంకరప్ప, జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, సర్పంచులు రమేష్‌బాబు, భాస్కర్, రమేష్, వెంకట భార్గవ్, ఎంపీటీసీలు పరంధామ, మోహన్‌రెడ్డి, గురుమూర్తి, శ్రీనివాసులు మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మెజార్టీ సాధనకు సమష్టి కృషి



బూత్ కమిటీ సభ్యుల జాబితాను అందజేస్తున్న నేతలు

గంగవరం: ఈ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎంపీ, పలమనేరు ఎమ్మెల్యే అభ్యర్థులు రెడ్డెప్ప, వెంకటేగౌడ గెలుపుతో పాటు అధిక మెజార్టీ సాధనకు బూత్ కమిటీ సభ్యులు సమష్టి కృషి చేయాలని గంగవరం పార్టీ నేతలు సూచించారు. శుక్రవారం గంగవరం పంచాయతీ బూత్ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలతో మేము సిద్ధం -మా బూత్ సిద్ధం సమావేశం నిర్వహించారు. బూత్ కమిటీ సభ్యుల జాబితాను అందజేసి మాట్లాడారు. ప్రతి గ్రామంలో నాయకులు, కార్యకర్తలు అందురూ ఒకే తాటిపై నిలబడి జగనన్న గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలని, ఈ ఐదేళ్ల పాలనలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన మంచిని, మళ్లీ అధికారంలోకి వస్తే జరిగే మేలును ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, గిరిరాజారెడ్డి, చలపతిరెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం

ఆరు పంచాయతీల్లో బూత్ కమిటీ సమావేశాలు



బూత్ కమిటీలతో చర్చిస్తున్న మండల నాయకులు

పలమనేరు: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా మండలంలోని పార్టీ శ్రేణులు పనిచేయాలని మండల కన్వీనర్ బాలాజీనాయుడు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు విధ్వనాథరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రంగన్న పిలుపునిచ్చారు. మండలంలోని జగమర్ల, టి.వడ్డూరు, కొలమాసనపల్లె, పెంగరగుంట, సముద్రపల్లె, కరిడిమొడుగు పంచాయతీల్లో బూత్‌కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడారు. ఉప్పు సాయం చేసినోడిని ఊపిరి ఉన్నంత వరకు గుర్తుపెట్టుకోవాలనే పెద్దలన్నట్టు మనకు ఇన్ని సాయాలు చేసిన ఈ రాష్ట్ర ప్రభుత్వానికి అండగా నిలవాల్సిన సమయం వచ్చిందన్నారు. 2014 ముందు ప్రభుత్వానికి 2014 నుంచి ఇప్పటిదాకా ఉన్న ప్రభుత్వానికి ఉన్న తేడాను జనం గమనించాలన్నారు. మీకు మేలు జరిగుంటేనే ఆదరించండని దేశంలో ఏ నేత ఇప్పటివరకూ చెప్పిన దాఖలాలు లేవన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని విస్తృత ప్రచారం చేయాలన్నారు. సర్పంచులు, నాయకులు విజయ్, రామచంద్ర, మునస్వామి, గోవిందురెడ్డి, రాజారెడ్డి, వడ్రాయగౌడ, రంగనాథం, తిరుమలేష్, బాలాజీనాయుడు, బాబురెడ్డి, గోవిందప్ప, శీనా, మనోజ్ పాల్గొన్నారు.

మోహినీ అలంకారంలో విహారం



మోహినీ అలంకారంలో పూజలందుకున్న శ్రీవారు

పుంగనూరు: స్థానిక కోనేటి వద్ద ఉన్న శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఐదవ రోజు శుక్రవారం స్వామివారు మోహినీ అలంకారంలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత ఆలయంలో ప్రధాన అర్చకులు శ్రీనివాసచార్యులు బృందం హోమాలు, అభిషేక పూజలు నిర్వహించింది. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. భక్తుల గోవింద నామస్మరణతో ఆలయం మార్మోగింది. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు పర్యవేక్షించారు.

నేటి నుంచి పార్టీ సమావేశాలు

సదుం: మండలంలో పంచాయతీల వారీగా శనివారం నుంచి రెండ్రోజుల పాటు పార్టీ సమావేశాలు నిర్వహిస్తున్నట్టు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. 23న తిమ్మానాయనపల్లె, అమ్మగారిపల్లె, నడిగడ్డ, చెరుకువారిపల్లె, జోగివారిపల్లె, మొరవపల్లె, బూరగమంద, ఎర్రాతివారిపల్లెలో సమావేశాలు జరుగుతాయన్నారు. 24న 79-ఏ చింతమాకులపల్లె, ఊటుపల్లె, చింతలవారిపల్లె, పాలమంద, కంభంవారిపల్లె, చింతపర్తివారిపల్లె, సదుం, తాటిగుంటపాలెం, రెడ్డివారిపల్లెలో సమావేశాలు నిర్వహించనున్నట్టు వివరించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రధాన నాయకులు సమీక్షిస్తారని చెప్పారు.

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు



మాట్లాడుతున్న అబ్జర్వర్ మధుసూదన్‌రెడ్డి

పుంగనూరు: ఎన్నికల ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తున్నట్టు అబ్జర్వర్, స్పెషలాఫీసర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం జెడ్పీ అతిథి గృహంలో ఆర్వో మధుసూదన్‌రెడ్డితో కలిసి ఎన్నికల ఏర్పాట్లపై ఏఆర్‌ఓలు, ఇతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడూత, ఎన్నికలను నిష్పక్షపాతంగా, వివాదాలకు తావులేకుండా నిర్వహించాలన్నారు. నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలు, వాటి వసతులు, సిబ్బంది నియామకం తదితర విషయాలపై ఆర్వోతో చర్చించారు. సమావేశంలో ఏఆర్‌ఓ నరసింహప్రసాద్, తహసీల్దార్ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోండి



ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేస్తున్న డ్వాక్రా మహిళలు

పెద్దపంజాణి: ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏపీఎం క్రిష్ణప్ప కోరారు. శుక్రవారం మండలంలోని పెద్దకాప్పల్లె పంచాయతీలో డ్వాక్రా మహిళలతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటు వజ్రాయుధం లాంటిదని, ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా మంచి నాయకత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. సీసీ వసంత., సంఘమిత్రలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ : డ్రైవర్‌కు తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన దిలీప్‌కుమార్

చౌడేపల్లె: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ ప్రైవేటు స్కూల్ డ్రైవర్ తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం రాత్రి చౌడేపల్లె-సోమల మార్గ మధ్యంలో చోటుచేసుకుంది. వివరాలు.. పరికిదొన పంచాయతీ దొనపల్లెకు చెందిన దిలీప్‌కుమార్ విజయవాణి స్కూల్ బస్సులకు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోజూ బస్సును సోమలలో పార్క్ చేసి ద్విచక్ర వాహనంలో సింగిరిగుంట మీదుగా స్వగ్రామానికి వెళ్లేవాడు. ఈ నేపథ్యంలో అతడు వెళ్తుండగా సింగిరిగుంట సమీపంలోని చిన్నడ్యాం వద్ద గుర్తు తెలియని వాహనం అతడిని ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన అతడు కోమా స్థితిలో ఉన్నట్టు 108 సిబ్బంది తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిప్రపత్తులతో ప్రతిష్ఠాపన



స్థానిక ఇందిరమ్మ కాలనీలో నిర్మించిన శ్రీవినాయకస్వామి ఆలయంలో శుక్రవారం మహాగణపతి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు.ఉదయం భగవత్ ప్రార్థన, కుంభారాధన, ఉక్తహోమం, చతుర్దశకళశసహిత అభిషేకాల అనంతరం ప్రాణప్రతిష్ఠ, ధేనుదర్పణ దర్శనం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. అర్చకులు తిప్పాచార్యులు వేదమంత్రోచ్చరణతో మహాగణపతి ప్రతిష్ఠ చేశారు. - బైరెడ్డిపల్లె

కేంద్ర బలగాల కవాతు



మండలంలోని ఉన్సిగానిపల్లె, గోవిందపల్లె, విజలాపురంలో శుక్రవారం కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. కుప్పం డీఎస్పీ శ్రీనాథ్ మాట్లాడుతూ, రాబోవు అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు, ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ధైర్యం కల్పిస్తూ కవాతు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కుప్పం రూరల్ సీఐ ఈశ్వర్ రెడ్డి, ఎస్‌ఐ శివకుమార్, పోలీసులు కూడా పాల్గొన్నారు. - రామకుప్పం

మైనారిటీలూ! ఉమ్మడి పార్టీలకు దూరంగా ఉండండి



పుంగనూరులో ప్రచారం చేస్తున్న ఫక్రుద్దీన్ షరీఫ్, అర్షద్‌అలి

పుంగనూరు: బీజేపీతోపొత్తు పెట్టుకుని ముస్లిం మైనారిటీల మనుగడకు ముప్పు కలిగించే మతతత్వ ఉమ్మడి అభ్యర్థులకు దూరంగా ఉండి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకే ఓట్లు వేయాలని సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్, కౌన్సిలర్ అర్షద్‌అలి పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని నాగపాళ్యెంలో ఇంటింటా ఎన్నికల కరపత్ర ప్రచారం నిర్వహించారు.అలాగే కౌన్సిలర్లు కమలమ్మ, పద్మావతమ్మ, సాజిదా, సాజిదాబేగం, భారతి, జేపీ యాదవ్, కొండవీటి నటరాజ తాము ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులలో, మండలంలోని సింగిరిగుంటలో సర్పంచ్ ఆంజప్ప, దళిత నాయకులు రాజు, శంకరప్ప, కృష్ణప్ప, చెన్నరాయుడు, కుమార్, బాలాజి, మంజు ఇంటింటా ప్రచారం చేశారు. ఎన్నికల్లో మైనారిటీలను మోసం చేసేందుకు రకరకాల కుట్రలు పన్నుతారని, వారికి గుణపాఠం నేర్పాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డికిటట్లు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజారీతో గెలిపించాలని కోరారు.

భరత్‌ను గెలిపించాలని ప్రచారం



ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

రామకుప్పం: కుప్పం వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ భరత్‌ను కుప్పం ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరుతూ శుక్రవారం ఆ పార్టీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రచారం చేశాయి. చెప్పాడంటే చేస్తాడంటే నినాదంతో మండలంలోని వీర్నమల పంచాయతీలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. నవరత్నాలతో సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికి అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. కుప్పం నియోజక వర్గంలో ఎమ్మెల్సీ భరత్ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. కరోనా కష్టకాలంలో కుప్పం ప్రజలకు అండగా నిలవడమేకాకుండా కుప్పం అభివృద్ధిలో ఆయన కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యవంతమైన శిశువులకు జన్మ



పోషణ్ పక్వాడ కార్యక్రమంలో సీడీపీఓ ఇందిరా ప్రియదర్శిని, అంగన్‌వాడీ కార్యకర్తలు

పెద్దపంజాణి: గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన శిశువులకు జన్మనిస్తారని ఐసీడీఎస్ పలమనేరు సీడీపీఓ ఇందిరా ప్రియదర్శిని అన్నారు. మండలంలోని రాయలపేట అంగన్‌వాడీ కేంద్రం-2లో శుక్రవారం పోషణ్ పక్వాడ వారోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, పౌష్టికాహారం ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిరుధాన్యాల ప్రాముఖ్యత, వినియోగం గురించి తెలియజేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పంపిణీ చేస్తున్న బాలామృతం ఉపయోగం గురించి వివరించారు. అనంతరం పోషణ్ పక్వాడ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శారద, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకుందాం



మాట్లాడుతున్న న్యాయమూర్తి వాసుదేవరావు

- సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవరావు

పుంగనూరు: నీటి వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, లేనిపక్షంలో భావితరాలు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని సీనియర్ సివిల్‌జడ్జి వాసుదేవరావు హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం మున్సిపాలిటీలో కమిషనర్ నరసింహప్రసాద్ ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా న్యాయమూర్తి మాట్లాడుతూ, జలవనరులు, భూగర్భ జలాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నీటిని అవసరాలకు మించి వాడరాదని, పొదుపుగా వాడి భూగర్భజలాలను కాపాడుకోవాలన్నారు. ప్రతి వర్షపు నీటి బొట్టునీ భూమిలో ఇంకేలా చేయగలిగితే భూగర్భ జలాల మట్టం పెరగడానికి అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో న్యాయవాది వీరమోహన్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ రసూల్‌ఖాన్, డీఈఈ మహేష్ పాల్గొన్నారు.

పలమనేరులో..



పలమనేరు: మాట్లాడుతున్న న్యాయవాది భాస్కర్

పలమనేరు: తాగునీటిని వృథా చేయరాదని స్థానిక న్యాయవాది ఎల్ భాస్కర్ అన్నారు. శుక్రవారం ప్రపంచ నీటి దినోత్సవం పురస్కరించుకుని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు ఆదేశాలతో మున్సిపల్ పంప్‌హౌస్ ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయవాది మాట్లాడుతూ, వర్షపు నీరు భూమిలో ఇంకేలా ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వేసవి దృష్ట్యా నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. నీరును విచ్చలవిడిగా వాడితే భవిష్యత్తులో నీటికోసం ఎన్నో సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్, న్యాయవాది ఆరీపుల్లా, మహిళా సంఘాల సభ్యులు, సచివాలయ సిబ్బంది, ఆర్‌పీలు పాల్గొన్నారు.

రాహుకాల అభిషేక పూజలు



విశేష అలంకరణలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం అభిషేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈఓ చంద్రమౌళి అధ్వర్యంలో అమ్మవారికి అభిషేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు వివిధ ప్రాంతాల భక్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. పూజలు అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.